శిథిలావస్థలో బడి



శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం



పెచ్చులూడుతున్న పైకప్పు

- లక్ష్మణచాంద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం
- పెచ్చులూడుతున్న పైకప్పు
- అసంపూర్తి భవనం, షటిల్ కోర్టులో తరగతుల నిర్వహణ
- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడి దర్శనమిస్తుండగా, వర్షాకాలంలో నీరు చేరి ఊరుస్తోంది. ఆరు తరగతి గదులకు కిటికీలు, తలుపులు లేవు. మూత్రశాలలు, మరుగుదొడ్లతోపాటు మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒంటికి, రెంటికి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గత ప్రభుత్వం మన ఊరు–మనబడి కింద పాఠశాలలో అదనపు తరగతి గదులు మంజూరు చేసింది. పిల్లర్లు, స్లాబ్ వేసి అలాగే అసంపూర్తిగానే వదిలేశారు. దీని పక్కన షటిల్ ఆడుకునేందుకు ఇండోర్ స్టేడియం నిర్మించారు. ప్రస్తుతం అసంపూర్తి భవనం, షటిల్ కోర్టుల్లో తరగతులను నిర్వహిస్తున్నారు. అసంపూర్తి భవనంలో కోతులు గుంపులుగా వస్తుండడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కాగా, జూన్ 3న పాఠశాలను కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించి విద్యార్థుల ఇబ్బందులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి అసంపూర్తి భవనాన్ని పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోలేదు. నిత్యం విద్యార్థులు ఇబ్బందుల మధ్య చదువులు కొనసాగించాల్సి వస్తోంది.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. తరగతి గదులు, కనీస వసతులు లేక జూన్‌లో 124 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుతుంది. ప్రస్తుతం ఆ సంఖ్య 94 చేరగా, కనీస వసతులు కల్పించకపోతే సంఖ్య మరింత పడిపోయే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి అసంపూర్తి భవనం పూర్తిచేయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

శిథిల భవనానికి రంగులు

శిథిలావస్థకు చేరి భవనానికి, ఆరు తరగతి గదులకు వేసవికాలంలో రంగులు వేయడం, ఒక్కో గదిలో నాలుగు ఫ్యాన్లు రిపేరు చేయించడం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. శిథిల భవనానికి రంగులు వేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



షటిల్ కోర్టులో తరగతి నిర్వహణ

ఇబ్బందిగా ఉంది



తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్డి లేక ఇబ్బందిగా ఉంది. ఒంటికి, రెంటికి ఇంటికి వెళ్తున్నాం. ప్రతీరోజు అవస్థలు పడుతున్నాం. అధికారులు పట్టించుకుని మా ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– అమూల్య, విద్యార్థి

చర్యలు చేపట్టాలి



ఆరు తరగతి గదులు ఉపయోగంలో లేకుండా ఉన్నాయి. అసంపూర్తి భవనంలోనే ఇబ్బందుల మధ్య చదువులు కొనసాగుతుంది. కోతులు గుంపుగా వస్తుండడంతో చదువులకు ఆటంకం ఏర్పడుతుంది. అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలి. – మహితి, విద్యార్థి

దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

కడెం/పెంబి: దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ తెలిపారు. పెంబి ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణ, కడెంలో రూ.10 లక్షలతో భవిత కేంద్రాల భవన నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. పెంబి ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు బెల్టు, టైలు అందజేశారు. కెరమెరి మండలంలో సావర్కేడ్ పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం దోత్తి వాగుపై ఐరన్ వంతెన నిర్మాణం చేపడుతామని గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామస్తులకు హామీచ్చారు. ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందిన కడెం మండలం కొండుకూర్‌కు చెందిన సంగం రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు అందించారు. ఏఎంసీ చైర్మన్ భూషణ్, తహసీల్దార్లు ప్రభాకర్, లక్ష్మణ్, ఎంపీడీవో అరుణ, ఎంఈవోలు షేక్ హుస్సేన్, రాంచందర్, నాయకులు స్వప్నీల్‌రెడ్డి, రమేశ్, శంకర్, స్వామి, మల్లేశ్, సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్, ఈడబ్ల్యూఐడీసీ ఏఈఈ మహేశ్, హెచ్‌ఎం మధురవాణి ఉన్నారు.



కడెం: పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

కరాటే బెల్ట్ పోటీల్లో ప్రతిభ

భైంసాటౌన్: జిల్లాకేంద్రంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ నిర్మల్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే ట్రెయినింగ్, కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భైంసా నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. అసోసియేషన్ చీఫ్, ఇండియా చీఫ్ పరీక్షకులు సెన్సాయి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కరాటే పరీక్షకులు సెన్సాయ్ తేజేందర్ సింగ్ భాటియా ఆధ్వర్యంలో జపాన్ కరాటే, శోటోకాన్ బెల్ట్స్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించగా, జిల్లా నుంచి 800 మంది పాల్గొన్నారు. వీరిలో బాసర, కుభీర్, తానూర్, లోకేశ్వరం మండలాల నుంచి 35 మంది క్రీడాకారులు పాల్గొని జూనియర్ రెడ్, యెల్లో, ఆరంజ్, గ్రీన్ బెల్ట్, బ్లాక్ బెల్టులు సాధించినట్లు కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. గోర అనన్య (భైంసా), అవునూర్‌వార్ ప్రతిక్ష (దార్ కుబీర్), కొప్పుల శ్రీ సర్వగ్న (బాసర) కరాటే బ్లాక్ బెల్ట్స్ (శోధన్) మొదటి డాన్ సాధించి, కరాటే నూతన మాస్టర్లుగా ప్రశంసపత్రాలు అందుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి భూషణ్, టెక్నికల్ డైరెక్టర్ స్వామి, శిక్షకులు మృణాళిని, భైంసా మార్షల్ ఆర్ట్స్ శిక్షకులు జ్ఞానతేజ, రాజశ్రీ, శివరాజ్ గౌడ్, అనూష, శిక్షకులు అభినందించారు.



బ్లాక్ బెల్ట్స్ (శోధన్) మొదటి డాన్ అందుకుంటున్న భైంసా కరాటే క్రీడాకారులు

యూరియా కోసం బారులు

కడెం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు బారులుతీరారు. యూరియా స్టాక్ కన్నా రైతులు అధికసంఖ్యలో వచ్చారు. వారం రోజులుగా యూరియా దొరకడం లేదని వాపోయారు.



పీఏసీఎస్ ఎదుట రైతులు

క్లుప్తంగా

అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఖానాపూర్: డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్, బహుజన కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్న డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి విన్నవించారు. పేదలకు కేటాయించిన ఇళ్లను కొందరు అక్రమార్కులు డబ్బుల కోసం తప్పుడు సర్వేలు చేసి అనర్హులకు కేటాయించారని ఫిర్యాదు చేశారు. దుర్గం లింగన్న, తోట రాధ, గౌస్, మాజిద్ ఖాన్, షాదుల్లా, కమల, లక్ష్మి, రుక్మ తదితరులు ఉన్నారు.

రోబోటిక్స్‌పై శిక్షణ



శిక్షణలో విద్యార్థులు

బాసర: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ ఇచ్చారు. బేసిక్ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్, ఆండ్రనో బోర్డు, వివిధ రకాల సెన్సార్లు పనిచేసే విధానంపై 21 రకాల పనితీరును వివరించారు. రోబోటిక్ చేసే పని విధానంపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

కడెం: మండలంలోని పెద్దూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు చిట్టేటి గంగవ్వ (105) మృతి చెందింది. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం మృతిచెందినట్లు కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపారు.

టెట్‌పై నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి

నిర్మల్ రూరల్: టెట్‌పై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని ఆర్డీవో రత్నకళ్యాణికి తపస్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులు ప్రమోషన్ కేడర్‌లో కొనసాగాలంటే తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులై ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ఉత్తీర్ణత కాకపోతే సర్వీసు వదులుకోవాలి అనే నిర్ణయం సీనియర్ ఉపాధ్యాయులకు శరాఘవతంగా మారిందన్నారు. ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు. ఆయన వెంట సుదర్శన్ తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



సురేష్ చందర్‌గౌడ్

లోకేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సురేష్‌చందర్‌గౌడ్‌కు ఎంపీవోగా సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, సూపరింటెండెంట్ వెంకటరమేశ్, నాయకులు బాయమోల్ల భోజన్న, ముత్తన్న ఉన్నారు.

ఎంపీవోగా విశ్వేశ్వరరావు



విశ్వేశ్వరరావు

తానూరు: ఎంపీవోగా నీలగిరి అనంత విశ్వేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ విడుదలచేసిన ఉత్తర్వుల్లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విశ్వేశ్వరరావుకు ఎంపీవోగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయన్ను సిబ్బంది సన్మానించారు.

తహసీల్దార్‌గా భోజన్న



భోజన్న

లోకేశ్వరం: తహసీల్దార్‌గా భోజన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సర్ఫరాజ్ నవాబ్ డిప్యూటేషన్‌పై నిర్మల్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. మంచిర్యాల జిల్లాలో పనిచేసిన భోజన్న డిప్యూటేషన్‌పై ఇక్కడ వచ్చి బాధ్యతలు చేపట్టారు.

ముదిరాజ్‌లను బీసీ‘ఏ’ జాబితాలో చేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

కుంటాల: ముదిరాజ్‌లను బీసీ‘డీ’నుంచి ‘ఏ’ జాబితాలో చేర్చాలని కోరుతూ సంఘం సభ్యులు సోమవారం తహసీల్దార్ కమల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ ఆలూరి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు మెల్ల సాయిలు, కోశాధికారి వెంకటేశ్, కార్యనిర్వాహక సభ్యుడు రవి, సభ్యులు ఉన్నారు.

దివ్యాంగులకు పింఛన్లు పెంచాలి



భైంసాటౌన్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు




బాసర: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

భైంసాటౌన్/కుంటాల/బాసర/లక్ష్మణచాంద/లోకేశ్వరం/ముధోల్/దస్తురాబాద్: రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులు, ఇతర పింఛన్‌దారులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచి అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌సీ(మహాజన సోషలిస్ట్ కమిటీ) నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలో పలుచోట్ల దివ్యాంగులతో కలిసి ర్యాలీ అనంతరం సోమవారం తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించి బైఠాయించారు. తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, కమల్‌సింగ్, భోజన్న, శ్రీలత, విశ్వంబర్, డీటీలు ప్రకాశ్, బాబుసింగ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6 వేలు, ఇతర పింఛన్‌దారులకు రూ.4 వేలకు పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు నంద కుమార్, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ఇన్‌చార్జి నాగభూషణం, జిల్లా వికలాంగుల అధ్యక్షుడు నరసింహ స్వామి, ఎమ్మార్పీస్ జిల్లా అధికార ప్రతినిధి కల్లెడ సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి కైరుద్దీన్, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, సలహా దారు సుధాకర్, శంకర్, నాయకులు భోజరెడ్డి, శకు ంతల, పోసాని, బాబు, శ్రీనివాస్, మానాజీ, భోజ న్న, మహేశ్వర్, నాగరాజు, ఫిరాజి, కైసర్, గణేశ్, దే వన్న, దేవిదాస్, సాయి, రాజు, గంగాధర్, లక్ష్మ ణ్, వెంకటరమణ, శంకర్, రాజామణి, కాంత్రి, రవి పాల్గొన్నారు.

‘మత్స్య’ సొసైటీ ఏర్పాటు చేయకుంటే ఆందోళన

లక్ష్మణచాంద: హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా మండలంలోని పీచర గ్రామంలో మత్స్య సహకార సంఘాన్ని ఏర్పాటు చేయకుంటే నిరవధికంగా ఆందోళనలు చేపట్టడంతోపాటు కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టులో సొసైటీ ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశాలిస్తే ఇప్పటికి చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు వీడీసీ సభ్యుల ఒత్తిడికి భయపడి సొసైటీ ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అఖిలభారత కోలి సమాజ్ జాతీయ కార్యవర్గ సభ్యులు బొజ్జ నారాయణ, జిల్లా ముదిరాజ్ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు హరీశ్, నాయకులు పోశెట్టి, నాయకులు బొర్రన్న, శ్రీకాంత్, నరేశ్, ముత్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

దారిలోనే ఓపీ..రాకపోకలకు ఇబ్బంది!

భైంసాటౌన్: పట్టణంలోని ఏరియాస్పత్రిలో రోజురోజుకు రోగుల తాకిడి పెరుగుతోంది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో, ఆస్పత్రికి ప్ర తీరోజు 500లకు మించి ఓపీ నమోదవుతోంది. ఉదయం 9 నుంచే ఓపీ కౌంటర్ వద్ద రశీదు(ప్రిస్క్రిప్షన్ రిసిప్ట్) కోసం బారులు తీరి కనిపిస్తున్నారు. అయితే, రోగులు వచ్చే ప్రధాన గేటు వద్దే ఓపీ కౌంటర్ ఉంది. రోగులు అధిక సంఖ్యలో వస్తుండడంతో క్యూలో నిల్చునేవారితో ప్రధాన గేటు వద్ద ఇతరుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. మహిళలు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు తోసుకుంటూ వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి అధికారులు ఓపీ కౌంటర్ వద్ద రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలని రోగులు, బంధువులు కోరుతున్నారు.



ఓపీ కౌంటర్ వద్ద క్యూలో రోగులు

రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవం

భైంసాటౌన్/ఖానాపూర్/దస్తురాబాద్: సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. భైంసా బస్టాండ్ వద్ద సీపీఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శంకర్ మాట్లాడుతూ ఈనెల 17న హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ట్రస్ట్ భవన్‌లో నిర్వహించే ముగింపులో పాల్గొనాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు విలాస్, రమేష్, జిల్లా కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు గోపి, భైంసా మండల నాయకులు ఉన్నారు.

- ఖానాపూర్‌లోని కుమురం భీం చౌరస్తా వద్ద అమరులకు నాయకులు నివాళులర్పించారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎండీ ఖాజామోహినొద్దీన్, మంచికంటి లక్ష్మణ్, యోగలక్ష్మి, జెట్టి సంజీవ్, రాజేశ్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.
- ఈ నెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించే తెలంగాణ సాయధ పోరాట సభకు అన్నివర్గాల ప్రజలు తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ కోరారు. దస్తురాబాద్ మండలం బుట్టాపూర్‌లో సోమవారం సీపీఎం పార్టీ జెండావిష్కరించారు. శ్రీనివాస్, తిరుపతి, రజిత, రవి, గంగాధర్, నరేందర్ పాల్గొన్నారు.

- **‘రాష్ట్రాల కార్మికులను నియంత్రించాలి’**

భైంసాటౌన్: ఇతర రాష్ట్రాల నుంచి పని నిమిత్తం వస్తున్న కార్మికులను నియంత్రించాలని భైంసా పెయింటర్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అజ్మీరా సంకేత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు స్థానిక యూనియన్లలో సభ్యత్వం చేసుకోవడం లేదని, దీంతో యూనియన్ నిబంధనలు పాటించకపోవడంతో స్థానిక కార్మికుల ఉపాధికి ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ పాల్గొన్నారు.

- **‘ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వొద్దు’**

లోకేశ్వరం: జిల్లాలో వలసవచ్చిన లంబాడాలకు ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వొద్దని ఆదివాసీ నాయకపోడ్ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ సోమవారం తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందజేశారు. నాయకులు గంజాల గంగాధర్,నీలగిరి గంగాధర్, మెట్టు నరేశ్, జగదీప్, సాయిలు, అన్నారం గంగాధర్ ఉన్నారు.

- **వీడీసీ కార్యవర్గం**

కుంటాల: లింబా(కె)లో వీడీసీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అనంతుల రాజు, కోశాధికారిగా సుంకరి సాయినాథ్, రైటర్‌గా గాసిందె శ్రీకాంత్, తదితరులు ఎన్నికయ్యారు.

- **భూములను కాపాడాలి**

లక్ష్మణచాంద: బోరిగాంలో భూములు కాపాడాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందించారు. భూములు అన్యక్రాంతం అవుతున్న తరుణంలో వాటిని కాపాడాలని కోరారు.

- **గ్రామ విద్య ప్రాజెక్టు ప్రారంభం**

భైంసారూరల్: వానల్‌పాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామీణ్ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ విద్య ప్రాజెక్టును మాటేగాం కాంప్లెక్స్ హెచ్‌ఎం రఘు ప్రారంభించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, ఆటపాటలతో విద్యనందిస్తామన్నారు. ఫౌండేషన్ చైర్మన్ నరేశ్ జన్మదినం సందర్భంగా ఈ ప్రాజెక్టు ప్రారంభించడం అభినందనీయమన్నారు. వలంటీరు రజితకు ప్రతినెల రూ. 3వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం ఎల్లన్న, నాయకులు ముత్యంరెడ్డి, సాయారెడ్డి, రాహుల్, ఈశ్వర్, భోజవ్వ ఉన్నారు.

- **పోషణ్ బీ..పడాయీ బీపై అవగాహన**

ఖానాపూర్: ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఖానాపూర్, పెంబి, మామడ మండలాల అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ బీ..పడాయీ బీ కార్యక్రమంపై సీడీపీవో శ్రీలత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్లు శ్యామల, రజిని తదితరులు ఉన్నారు.

- **సైబర్ నేరాలపై అవగాహన**

సోన్: మండలంలోని పాక్ పట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై హెడ్ కానిస్టేబుల్ తాహెర్ ఖాన్ సోమవారం అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

సైబర్ క్రైమ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు రాజు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.వెంకన్న, టీచర్లు ఉన్నారు.

- **ఘనంగా శ్రీ జయంతి వేడుకలు**

కుంటాల: మండల కేంద్రం ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో సోమవారం ఘనంగా శ్రీ జయంతి వేడుకలను జరుపుకున్నారు. కన్నస్ తిరునక్షత్రం పురస్కరించుకుని శ్రీ రాధాకృష్ణులకు అభిషేకం, పుష్పార్చన, పూజా కార్యక్రమాలను అర్చకుడు శ్రీకాంత రామానుజ దాస్ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

- **ఆది కర్మయోగిపై అవగాహన**

మామడ: కప్పన్‌పల్లిలో సోమవారం ఆది కర్మయోగి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించిన అధికారుల బృందం గ్రామంలోని సమస్యలను తెలుసుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అధికారులు ప్రభాకర్, రమణారెడ్డి, మధుకర్‌రెడ్డి, క్రాంతికుమార్, స్వామిరెడ్డి, శ్రీలత, సాయిచరణ్ ఉన్నారు.

- **వర్షానికి కూలిన ఇల్లు**

కుంటాల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆదివారం రాత్రి కుంటాలకు చెందిన పిట్ల గజ్జారాం ఇల్లు కూలింది. అధికారులు తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరారు.

- **జిల్లాస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ**

ముధోల్: ముధోల్‌లోని రబీంద్ర పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సాయినాథ్ తెలిపారు. ఇటీవల తానూర్‌లో జరిగిన యోగా జిల్లా స్థాయి పోటీల్లో వత్సల్య, మధుప్రియ, ఎస్.యోగేశ్వరి, జె.మహేశ్, కె.మద్నేష్, శ్రేయ, పవన్, ఆమానియా ప్రతిభ కనబర్చారు.

- **మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి**

కుంటాల: మండలంలోని కల్లూరు, కుంటాల గ్రామాల్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తాగు, సాగు నీటి ప్రాజెక్టులతో నవభారత నిర్మాణానికి సేవలందించిన గొప్ప ఇంజనీర్ అని పలువురు కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు, కొత్తకాపు గంగన్న పాల్గొన్నారు.

- **చర్యలు తీసుకోవాలి**

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీలో బొడ్డోని కుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గంగపుత్ర సంఘం నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశారు. మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం అధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి రమేశ్, డైరెక్టర్లు రవి, చంద్ర విలాస్, లాలు, గణేశ్, సురేశ్, గంగాధర్ ఉన్నారు.

- **విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ**

తానూరు: స్థానిక జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థినులు ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలు బోధించారు. అనంతరం వారికి బహుమతులు అందించారు. హెచ్‌ఎం సాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ**

బాసర: కిర్గుల్(బి)గ్రామంలో విలేజ్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ చేశారు.

- **ఘనంగా హిందీ దివాస్**

లోకేశ్వరం/కుంటాల: లోకేశ్వరం మండలం పుస్పూర్ ప్రభుత్వ ఉన్నత, కుంటాలలోని ఆదర్శ పాఠశాలల్లో హిందీ దివాస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు నాగన్నను పాఠశాల సిబ్బంది సన్మానించారు. హిందీ భాష గురించి హెచ్‌ఎం చంద్రప్రకాశ్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు విద్యార్థులకు వివరించారు. దేశంలో హిందీ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఉపాధ్యాయులు అశోక్, రాజశేఖర్, ముత్తన్న, మధుకర్ ఉన్నారు.

- **దొంగతనానికి యత్నించిన మహిళలు**

కడెం: మండల కేంద్రంలోని గణేశ్ డ్రెస్సెస్ దుకాణంలో నలుగురు మహిళలు దొంగతనానికి యత్నించారు. సోమవారం బట్టలు కొనేందుకు వెళ్లి దొంగతనం చేస్తుండగా యాజమాని రాజేశ్ గమనించడంతో అక్కడే బట్టలు పారేసి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని విచారించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ చెందినవారని, కేసు నమోదు చేశారు.

- **జిల్లా స్థాయి టీఎల్‌ఎంకు 10 మంది ఎంపిక**

లక్ష్మణచాంద: జిల్లా స్థాయి టీఎల్‌ఎంకు మండలం నుంచి 10 మంది ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈవో అశోక్‌వర్మ తెలిపారు. వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి టీఎల్‌ఎం పోటీల్లో పలువురు పాల్గొన్నారు. జయశ్రీ, సుమలత, లక్ష్మి, నర్మద, శ్వేత, వినయ్, శ్రీదేవి, సాయన్న, శిరీష, అర్చనలు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 18న జరిగే జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాలో పాల్గొంటారు.

- **బోధనలో మెలకువలు పాటించాలి**

దస్తురాబాద్: ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు పాటించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఎంఈవో గంగాధర్ సూచించారు. మండల కేంద్రంలో సోమవారం ప్రాథమిక స్థాయి టీఎల్‌ఎం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు బోధన సామగ్రి స్టాళ్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధన అందించే విధానం వివరించారు. తహసీల్దార్ విశ్వంబర్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

- **శాలువా ట్రెండ్ హవా..**

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్‌తోపాటు పలు గ్రామాల్లో మహిళలు గాజుల పండుగ, యువకుల శాలువా ట్రెండ్ కొనసాగుతోంది. దిలావర్‌పూర్‌లో సోమవారం పలువురు యువ రైతులు అందరూ కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుని శాలువాలతో ఒకరికొకరు సత్కరించుకున్నారు.

శుద్ధజల యంత్రం విరాళం

కుభీర్: కుభీర్ ఉన్నత పాఠశాలకు మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి రెడిశెట్టి నాగేశ్వర్ సోమవారంరూ.30 వేల విలువ గల శుద్ధజల యంత్రం విరాళంగా అందించారు. అదేవిధంగా పాఠశాలలో హిందీ దివస్ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. హెచ్‌ఎం సట్ల గంగాధర్, పాఠశాల చైర్మన్ వైశాలి, పారిశ్రామికవేత్త ఆనంద్, పాఠశాల కమిటీ సభ్యులు అభిషేక్, వెంకటస్వామి, గంగాశేఖర్ తదితరులు ఉన్నారు.

పథకాలపై కళాజాత

సోన్: న్యూవెల్మల్‌లో ప్రభుత్వ పథకాలపై సోమవారం కళాజాత నిర్వహించారు. వివిధ అంశాలపై కళాకారులు ఆటపాట రూపంలో వివరించారు. కార్యదర్శి భూపాల్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక కళాజాత సారధి కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.